క్లుప్తంగా...

ఉత్సాహంగా దసరా వేడుక



దసరా వేడుకల్లో సీఎంఆర్ గ్రూప్స్ చైర్మెన్, అధ్యాపకులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో శుక్రవారం దసరా, బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కళాశాల కార్యాలయంలో చైర్మెన్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణలు అధ్యాపకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీశైలం రెడ్డి, కల్చరల్ హెడ్ రోహిణిరెడ్డి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

10 శాతం మందికైనా 'డబుల్' ఇళ్లు ఇచ్చారా..!

బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

మేడ్చల్: మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలో 26వేల మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చామని సీఎం కేసీఆర్ పాల్గొన్న బహిరంగ సభలో ప్రగల్భాలు పలికారు గానీ స్థానికులకు ఇళ్లు రాలేదని బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆరోపించారు. మేడ్చల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డబుల్ ఇళ్లు అందిన 26వేల మందిలో 10 శాతం మంది నియోజకవర్గ వాసులకు ఇళ్ళు ఇచ్చామని నిరూపిస్తే ఎన్నికల్లో మేడ్చల్ నుండి బీజేపీ పోటీనుంచి తప్పుకుంటుందన్నారు. మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ ను దోచుకుంటున్నారే గాని ఎక్కడా అభివృద్ధి చేయలేదని అన్నారు. సమావేశంలో నాయకులు అమరం మోహన్‌రెడ్డి, కొంపల్లి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ పట్టణంలో ఘనంగా బతుకమ్మ

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఆరు రోజుల పాటు బతుకమ్మ సంబరాలు జరుపుకుని శుక్రవారం సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుకున్నారు. మేడ్చల్ పట్టణంలో 7 రోజులకే బతుకమ్మ పండగను నిర్వహించడం ఆనావాయితీగా వస్తుండటంతో బతుకమ్మ ఉత్సవాలను మహిళలు కాలనీలలో వెభవంగా జరుపుకున్నారు. పెద్ద చెరువులో,తుమ్మ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక



మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు,యువకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గణేష్, నాయకులు నర్సింహారెడ్డి,శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడ్చల్ రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నర్సింహరాజు గురువారం అర్ధరాత్రి మండలంలోని రేకులబావి వద్ద 44వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన నర్సింహరాజు అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లాలో శాసనసభ ఎన్నికలకు సంబంధించి నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకున్నప్పుడే.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, పోస్టల్ బ్యాలెట్ కేటాయింపు - సంసిద్ధత, స్ట్రాంగ్ రూమ్, సువిధ పోర్టల్ ,ర్యాండమైజేషన్ తర్వాత పీఓలు/ఏపీఓలకు శిక్షణ కోసం వేదికల గుర్తింపు,. పోలింగ్ స్టేషన్ల సందర్శన, పోలింగ్ స్టేషన్లలో మార్పులు , ఎన్నికల వ్యయ బృందాలు తీసుకోవాలిసిన చర్యలు తదితర అంశాలను ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ప్రస్తావించారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పూర్తి వివరాలను త్వరగా సమర్పించాలని సంబంధిత అధికారులకు గౌతమ్ సూచించారు. నామినేషన్లకు సంబంధించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎమ్) స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి సమాచారాన్ని పూర్తి స్థాయిలో అందచేయాలని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఆదేశించారు. శాసనసభ నియోజకవర్గాల్లో నామినేషన్లు వేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు.

◆ఎన్నికల కమిషన్ రూపొందించిన సువిధ యాప్ ద్వారా రాజకీయ పార్టీలు నామినేషన్ వేసేందుకు 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే నేరుగా సంబంధిత రిటర్నింగ్ అధికారి ద్వారా అనుమతి పొందవచ్చన్నారు. జిల్లాలో 12,500 మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ అవసరమని, ఒక్కో నియోజకవర్గానికి 2,500 మందికి శిక్షణ కోసం ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని రకాల మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల వ్యయ బృందం తప్పనిసరిగా ప్రతి రిటర్నింగ్ ఆఫీసును పరిశీలించి, అక్కడ రిజిష్టర్లు తప్పకుండా మెయింటెన్ చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే తన దృష్టికి తీసుకచ్చి,నివేదిక సమర్పించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడో సారి గెలుపొంది కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు బీఆర్ఎస్‌నేతలు కష్టపడిపనిచేయాలన్నారు. మున్సిపల్ చైర్మెన్ కొకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన ఎన్నికల అధికారి



సాక్షి, మేడ్చల్‌జిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం బోగారం హోలీమేరి ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్నికలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీసీపీ జానకి ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ గదులను స్వయంగా గౌతమ్ పరిశీలించారు. గదుల్లో అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు ఆయన సలహాలు, సూచనలు చేశారు. శాసనసభ ఎన్నికలకు సంబంధించి కళాశాలలో అవసరమైన చోట సీసీ కెమెరాలు, బ్యారికేడ్లు, పార్కింగ్ వసతులు కల్పించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీసీపీ జానకి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

గంజాయి స్వాధీనం.. ముద్దాయి పరార్

పోచారం: రూట్ వాచ్ చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులకు గంజాయి లభించింది. ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ మల్లయ్య తెలిపిన మేరకు.. తిమ్మాయిపల్లిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర శుక్రవారం రూట్ వాచ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వద్ద 6 కిలోల గంజాయితో పాటు టీవీఎస్ అపాచి బైక్ లభించింది. ముద్దాయి బైక్‌ను వదలి పారిపోయాడు. రూ. 1.75 లక్షల విలువ చేసే గంజాయి, బైక్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐలు పురుషోత్తంరెడ్డి, శ్రావణి, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు చేసినట్లు సీఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్

దొంగతనాల నివారణపై అవగాహన



మేడ్చల్ రూరల్: దసరా పండగ సందర్భంగా సొంత ఊరికి వెళ్లే వారు తగు జాగ్రత్తలు పాటించాలని మేడ్చల్ డీఐ ప్రసాద్, ఎస్ఐ నవీన్‌రెడ్డిలు ప్రజలకు సూచనలు చేశారు. శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీలలో దొంగతనాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పండగకు ఊరికి వెళ్లేవారు తమ విలువైన ఆభరణాలు,వస్తువులు, నగదు లాకర్లలో భద్రపరుచుకోవాని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహ్మగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



అనురాగ్ యూనివర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న దేవసేనా తదితరులు

ఘట్‌కేసర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ సంబురాలను అంబరాన్నంటేలా నిర్వహించాలని తెలంగాణ విద్యాశాఖ సంచాలకులు శ్రీ దేవసేనా అన్నారు. వెంకటాపూర్ అనూరాగ్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు ముఖ్య అతిథిగా హాజరై యూనివర్సిటీ సీఈఓ నీలిమా, అధ్యాపకులు, విద్యార్థినుతో కలిసి బతుకమ్మ ఆడారు.

మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులకు ఎన్నికల సామాగ్రి, కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ తదితర అంశాలపై అవగాహన అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి పూర్తి చేశారు. ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్లు 2,397గానూ బ్యాలెట్ యూనిట్ 25 శాతం ర్యాండమైజేషన్ చేయగా 2,997 అయ్యాయన్నారు. అలాగే కంట్రోల్ యూనిట్లు (సీయూ) కూడా 2,397 ఉండగా, ర్యాండమైజేషన్ ప్రక్రియ తర్వాత 2,997 అయినట్లు తెలిపారు. వీవీ ప్యాట్ల విషయంలో 2,397 గాను 40 శాతం ర్యాండమైజేషన్ చేపట్టగా, 3,356కు పెరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎమ్ గోడౌన్లకు గుర్తింపు పొందిన రాజకీయ నాయకులు, అధికారులు వెళ్లి శిక్షణ, అవగహన నిమిత్తం, బ్యాలెట్ యూనిట్ 192, కంట్రోల్ యూనిట్ 192, వీవీ ప్యాట్ 192 తీసి మిగతా వాటికీ ర్యాండమైజేషన్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఎన్నికల అధికారులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి



జవహర్‌నగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ కావ్య



కీసరలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

జవహర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కృష్ణానగర్‌లో కొమ్మరాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపంలో మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్లు లావణ్య సతీష్‌గౌడ్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, పాల్గొన్నారు.

సరస్వతి దేవి రూపంలో గడి మైసమ్మ

మేడ్చల్: దేవీ నవరాత్రి ఉత్సవాలలో ఆరవ రోజైన గురువారం అమ్మవారిని గడిమైసమ్మ ఆలయంలో సరస్వతీ దేవి రూపంలో ఆలయంకరించారు. వివిధ మండలపాలలో, కాలనీలలో, ఆలయాల్లో మూడవ రోజు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఆరవ రోజు సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. శుక్రవారం మండలంలోని పూడూర్ గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



మేడ్చల్ ఆర్టీసీ కాలనీ ఆలయంలో సరస్వతీ దేవిగా గడి మైసమ్మ